క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

దత్తిరాజేరు: మండలంలోని టి భూర్జవలస గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చింతగడ ప్రసాద్ కుటుంబానికి ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ తమ వంతు సాయం చేశారు. ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు, దుస్తులు శుక్రవారం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వైద్య శిబిరంలో రోగులకు తనిఖీలు



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: గజపతినగరం – 1 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన 104 ఉచిత వైద్య శిబిరంలో 61మంది రోగులను తనిఖీ చేసినట్లు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు పుష్పాంజలి తెలిపారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు ఆరోగ్య సూచనలు చేశారు.

విధి నిర్వహణలో ఉపాధ్యాయుడు మృతి



ఉపాధ్యాయుడు రమణారావు (ఫైల్)

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలం శేరీపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గొరజాన రమణారావు గుండెపోటుతో మృతి చెందారు. ఈయన ఇదే మండలంలోని కొండదాడి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం స్కూల్‌కి వెళ్లి బాత్‌రూముకి వెళ్లారు. ఈ క్రమంలో గుండెపోటు రావటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఉపాధ్యాయుడు మృతి పట్ల మండల విద్యాశాఖ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నేతలు సంతాపాన్ని తెలియజేశారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



సుమల గోవింద్

దత్తిరాజేరు: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో యాక్టివిటీ మెంబర్‌గా నియమించిన నేపథ్యంలో పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడతానని పాచలవలస మాజీ సర్పంచ్ సుమల గోవింద్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన సేవలు గుర్తించి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తనను జిల్లా కమిటీలో స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న పాలనలో ప్రజలకు జరిగిన మేలును విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ బలోపేతానికి పాటుపడతానన్నారు.

సత్ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీఓ

గజపతినగరం రూరల్: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయ సిబ్బంది కృషి చేయాలని సర్వశిక్ష అభియాన్ ఏపీఓ రామారావు అన్నారు. మండలంలోని మరుపల్లి గ్రామ ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మమేకమయ్యారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈఓ విమల తదితరులు ఉన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

కొత్తవలస : మండలంలోని రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు పంచాయితీ సిబ్బందికి శుక్రవారం సమాచారం అందించారు. దీంతో పంచాయితీ పారిశుధ్య నిర్వహణ సూపర్‌వైజర్ మోపాడ ప్రసాద్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక శ్మశాన వాటికకు తీసుకొచ్చారు. అక్కడ అంత్యక్రియలను నిర్వహించి పూడ్చిపెట్టారు. కాగా మృతుడు కొద్ది నెలలుగా స్థానికంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు గుర్తించారు.

ఎదురుచూపు

- వంద పడకల ఆస్పత్రి కోసం..
- ఏప్రిల్ నాటికి పూర్తయ్యే అవకాశం
- ఇప్పటికే సాధారణ ఓపీ 350

గజపతినగరం : మండల కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి వచ్చే సమయం కోసం నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే అత్యవసర పరిస్థితుల్లో రోగులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించే పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. అదే ఇక్కడి వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే రోగుల కష్టాలు తీరుతాయి. గజపతినగరం మండల కేంద్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా ఆధునికీకరించేందుకు సుమారు రూ.17కోట్లు మంజూరు చేసింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి దీని అవసరాన్ని అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తీసుకువెళ్లడంతో సానుకూలంగా స్పందించి తగు నిధులు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మధ్యలో వీటి పనుల్లో జాప్యం నెలకొంది. ఇటీవల మళ్లీ ఈ పనులు జోరందుకున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఈ ఆస్పత్రి ఎప్పటిలోగా అందుబాటులోకి వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే గజపతినగరం ఏరియా ఆస్పత్రికి రోజువారీ ఓపీ 350 పైబడి ఉంటుంది. రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ఆస్పత్రిలోనే వరండా, కారిడార్, మార్గంలో వీలైనంత మేరకు పడకలు వేసి రోగులకు వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఇక్కడ వంద పడకల ఆస్పత్రికి తగ్గట్టుగానే వైద్య సిబ్బంది ఉండడంతో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ, మెరకముడిదాం మండలాల నుంచి అధికంగా రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. ఇక్కడ శస్త్రచికిత్సల లక్ష్యం ఏడాదికి వెయ్యి ఉండగా సుమారు 800 వరకు ఆపరేషన్లు వైద్యులు చేస్తున్నారు. వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి వస్తే లక్ష్యానికి సులువుగా చేరువ అవుతామని వైద్యులు చెబుతున్నారు.



ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులు



ఏరియా ఆస్పత్రిలో ముగ్గురు నుంచి నలుగురు డాక్టర్లకు కేటాయించబడిన ఒకే గది



త్వరలో అందుబాటులోకి రానున్న 100పడకల ఆస్పత్రి

ఎదురు చూస్తున్నాం..



వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వస్తే అత్యవసర పరిస్థితుల్లో విజయనగరం వెళ్లాల్సిన పని ఉండదు. మాబోటి సామాన్య, మధ్యతరగతి, పేదలకు ఇక్కడే అన్ని రకాల వైద్య సదుపాయాలు పొందవచ్చు.

– లెంక సత్యం, కాలంరాజుపేట

చకచకా పనులు

గజపతినగరం వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కొద్ది రోజుల కిందట మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆస్పత్రికి వచ్చి పరిశీలించారు. అప్పటి నుంచి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– డాక్టర్ కిరణ్, ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్ఎంఓ, గజపతినగరం

రైతులకు అవగాహన



రైతుల తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏఓ సీహెచ్ రఘునాథ్ సూచించారు. చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామంలో రైతులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ప్రతీ రైతు భూఆధార్ లేదా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాల్సి ఉందన్నారు. భూములున్న ప్రతీ రైతు తప్పనిసరిగా దీన్ని రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. వివరాలు నమోదు అయితేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉంటుందన్నారు. సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు. – చీపురుపల్లి

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



చీపురుపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు కిల్లంశెట్టి సన్యాసిరావు పెన్నులు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు రూ.35 వేల విలువైన పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుడు తన తండ్రి కిల్లంశెట్టి ఆంజనేయులు మాస్టారు జ్ఞాపకార్థం వీటిని పంపిణీ చేశారు. – చీపురుపల్లి

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



గుర్ల మండలంలోని చుక్కపేట, బోడవరం గ్రామాల్లో ఢిల్లీకి చెందిన కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో సభ్యులు సామూహిక బోద వ్యాధి నివారణ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. బృందంలోని ఎన్‌యూహెచ్‌ఎం డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ ఆషిమా భట్నాగర్ ఇంటింటికి వెళ్లి బోద మందుల పంపిణీపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని చిన్నారులకు ఈ మాత్రలు మింగించే కార్యక్రమంపై ఆరా తీశారు. వారి వెంట తెట్టంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆక్యూబ్ ఉన్నారు. – గుర్ల

భూధార్ వెనుక కార్పొరేట్ కుట్ర



మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

బొండపల్లి: పేదలు సాగు చేసుకుంటున్న భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికే భూఆధార్, ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాకోటి రాములు, తోత్తడి పైడిపునాయుడు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో విలేకరులతో వారు శుక్రవారం మాట్లాడారు. కేవలం జిరాయితీ భూములు కలిగి ఉన్న వారికి మాత్రమే భూఆధార్ నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీని వల్ల అటవీ భూములు, దళితులు, పేద రైతులు సాగు చేసే డీ పట్టా భూములు, కౌలు రైతులు సాగు చేసే భూములకు ఫార్మర్ రిజిస్ట్రీ అవకాశం లేకుండా చేసిందన్నారు. దీని వల్ల రైతులకు సంక్షేమ పథకాలు అందే అవకాశం ఉండదన్నారు. దీని వల్ల జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం భూఆధార్ నమోదు ప్రక్రియను నిలిపివేసి పాత విధానంలోనే రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

నిబంధనల మేరకే పరిహారం



నిర్వాసితులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

లక్కవరపుకోట : పెందుర్తి – బౌడారా (516 బీ) రోడ్డు విస్తీర్ణంలో భూములు, గృహాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం నిబంధనలను అనుసరించి పరిహారం అందజేస్తామని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయం వద్ద సీతారామపురం, గంటుబూడి, మల్లివీడు, రంగారాయపురం, రంగాపురం, లక్కవరపుకోట గ్రామాలకు చెందిన నిర్వాసితులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పెందుర్తి – బౌడారా రోడ్డు విస్తీర్ణంలో భాగంగా 60 ఎకరాల మేర మూడు వందల మందికి చెందిన భూమి గుర్తించినట్లు తెలిపారు. వ్యవసాయ భూమికి సెంటుకు రూ.26,500, వ్యవసాయేతర స్థలాలకు ఒక్కో గజానికి రూ.6వేలు చొప్పున పరిహారం అందజేస్తామన్నారు. నిర్వాసితుల జాబితాల్లో లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ కార్యాలయ డీటీలు హరికిరణ్, పద్మ, స్థానిక డీటీ టి.రమేష్, ఆర్ఐ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



ఎస్.కోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవం

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం పలు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలువురు మాతృభాషా ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా పలుచోట్ల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



వేపాడ: హైస్కూల్‌లో పలు వేషధారణలో విద్యార్థులు



చీపురుపల్లి: ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవం

పంచాయతీ అనుమతుల్లేకుండా పనులా!

- మండల సమావేశంలో ఎంపీడీఓను ప్రశ్నించిన సర్పంచ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: పంచాయతీల అనుమతుల్లేకుండా.. వర్క్ ఆర్డర్ కూడా లేకుండా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి పనులు ఏ విధంగా చేపడతారని ఎంపీడీఓ ఆర్వీ రమణమూర్తిని పెదవేమలి సర్పంచ్ వర్రి పాపునాయుడు ప్రశ్నించారు. మినీ గోకులాలను పంచాయతీల తీర్మానాలు లేకుండానే నిర్మిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఏపీఓ సుందరరావును నిలదీశారు. పంచాయతీ తీర్మానం ఉంటేనే బిల్లులు చెల్లిస్తున్నామని ఏపీఓ సమాధానం చెప్పగా పంచాయతీ తీర్మాన కాపీలను అందించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పట్టుబట్టారు. ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. విద్య, వ్యవసాయ, ఉపాధి హామీ, విద్యుత్, గృహ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య శాఖలపై సమీక్షించారు. తాటిపూడి నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని పలువురు సభ్యులు కోరారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేసి పరిశుభ్రత ఉండేలా చూడాలని ఎంపీపీ హైమావతి సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మంగళగిరి సుధారాణి

చీపురుపల్లి: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షురాలుగా నియమితులైన చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి శుక్రవారం తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో నియోజకవర్గం ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షురాలుగా బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని పార్టీ బలోపేతం ద్వారా నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. తన నియామకానికి మద్దతు తెలిపిన శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో దళితులందరినీ ఏకం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో ఉన్న మండల, గ్రామ స్థాయి నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని పేర్కొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే : కలెక్టర్



ఎగువ ఎర్రవానిపాలెం గ్రామంలో రీసర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

కొత్తవలస : రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత రైతులతో పాటూ చట్టుపక్కల రైతులను పిలిచి సర్వే నిర్వహించాలని సూచించారు. మండలంలో రీ సర్వేకి సంబంధించి పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన చీపురువలస గ్రామం పరిధిలో ఎగువ ఎర్రవానిపాలెంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. సంబంధిత భూముల రికార్డులను పరిశీలించారు. సర్వే నంబర్లు ఆధారంగా రైతు వారీ భూ విస్తీరణపై ఆరా తీశారు. గ్రామంలోని భూముల వివరాలను తమకు అందజేయాలని, రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్స్ రికార్డులను అనుసరిస్తూ రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. సర్వే నిర్వహణలో అవకతవకలకు, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ కె.రమణమూర్తి, ఆర్డీఓ డి.కీర్తి, తహసీల్దార్ బి.నీలకంఠరావు, సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో వచ్చిన సమస్యలను పరిష్కరించండి : జేసీ



బి.రాజేరులో రీసర్వే జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న జేసీ

బొండపల్లి: రీసర్వేలో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ సూచించారు. మండలంలోని బి.రాజేరు గ్రామాన్ని రీసర్వే పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి రీసర్వే చేపట్టగా సర్వే ఏ విధంగా జరుగుతుందో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వే సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏంటని రెవెన్యూ అధికారులను, రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ ఏ మేరకు పూర్తయిందనే అంశాన్ని పరిశీలించారు. గ్రౌండ్ వాలిడేషన్ సక్రమంగా జరుగుతున్నదా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ రికార్డుల్లో ఉన్న తప్పిదాలను ఏవిధంగా సరి చేస్తున్నారో రెవెన్యూ అధికారులను, సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, వీఆర్‌ఓ గెద్ద నారాయణరావు తదితరులు ఉన్నారు.

రాయితీపై జొన్న రకం గడ్డి విత్తనాలు



రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారిణి

మెరకముడిదాం: మండలంలో పాడి రైతులకు అవసరమైన గడ్డి విత్తనాలు 75 శాతం రాయితీపై పంపిణీకి సిద్ధంగా వున్నాయని పశు వైద్యాధికారిణి హైమావతి తెలిపారు. శుక్రవారం మెరకముడిదాం పశువైద్య కేంద్రంలో పలువురు రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పశువులు ఎక్కువగా ఇష్టపడి తినే మొక్కజొన్న గడ్డి విత్తనాలు అందుబాటులో వున్నాయన్నారు. ఈ గడ్డి విత్తనాలు 5 కిలోలు ప్యాకెట్ సాధారణ ధర 460 రూపాయలు కాగా, 75 శాతం రాయితీ పోనూ 115 రూపాయలకు మాత్రమే వస్తుందన్నారు. మండలంలో వున్న అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ గడ్డి విత్తనాలను అందుబాటులో వుంచామని, స్థానికంగా వుండే పశు వైద్య సిబ్బందిని సంప్రదించి విత్తనాలను పొందవచ్చునని ఆమె తెలిపారు.

బాబూ.. హామీలు గుర్తు లేవా...!

- ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ మండిపాటు



మాట్లాడుతున్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి

శృంగవరపుకోట: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు గుర్తు లేవా... అంటూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) నాయకులు ప్రశ్నించారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో ఖండిపల్లి భీముడు అధ్యక్షతన ఆటో డ్రైవర్ల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఆటో, మోటారు కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, వాహన మిత్రలకు రూ.15వేలు ఇస్తామని, డ్రైవర్ల వ్యక్తిగత ప్రమాద బీమా రూ.10లక్షలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు పూర్తయినా హామీలు అమలు చేయలేదన్నారు. త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో తమకు కేటాయింపులు చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. ఇందులో భాగంగా మార్చి 4న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు తలపెట్టినట్టు వెల్లడించారు. జీఎస్ఆర్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్, జీఓ 21, 31లు, మోటారు యాక్టు చట్టం 106(1, 2) వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. థర్డ్ పార్టీ ఇన్సురెన్స్, టోల్ ప్లాజా ఫీజులు 30 శాతానికి తగ్గించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు బి.సురేష్, పి.నరసింహస్వామి, పాండు, జి.కృష్ణ, ఆర్.సన్యాసిదేముడు, ఆటో డ్రైవర్లు, మోటారు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గజపతినగరం : మండలంలోని పురిటిపెంటలో ముమ్మరంగా పారిశుధ్య పనులు పంచాయతీ అధికారులు చేపట్టారు. శుక్రవారం పురిటిపెంటలో పలు చోట్ల శానిటేషన్ పనులు చేస్తూ వెంటనే పూడికలను సుదూర ప్రాంతాలకు తరలించారు. కాలువలను, పురవీధులను పరిశుభ్రం చేయడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా బబ్బేలమ్మ అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన బబ్బేలమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్మించిన ఆలయం ప్రతిష్ఠ మహోత్సవాలు మేడపాటి కిషోర్ శర్మ బృందం మంత్రోచ్ఛారణాలతో నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి చామలాపల్లి తీర్థ మహోత్సవం

వేపాడ: మండలంలోని చామలాపల్లిలో శని, ఆదివారాల్లో తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతాన కుమార సుబ్రమణ్యస్వామి అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే తీర్థ మహోత్సవంలో శనివారం అన్న సమారాధన, కోలాటం, రామాంజనేయ యుద్ధం, సీతారామ కల్యాణం జరగనున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

మెనూ పాటించండి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత పాటిస్తూ.. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పక్కాగా పాటించాలని ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు సూచించారు. శింగరాయి పాఠశాలను వారు శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. బానాది ఎంపీయూపీ పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు సందర్శించి వర్కుబుక్స్, లెసన్ ప్లాన్స్ పరిశీలించారు.

పక్కాగా పాఠశాలల్లో మెనూ అమలు

మెరకముడిదాం: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటూ నాణ్యమైన భోజనాన్ని కూడా అందించాలని ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఇప్పలవలస ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాశాఖాధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలకు చెందిన అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పిల్లలకు ఉపాధ్యాయులు ఏ విధంగా భోధిస్తున్నారో నేరుగా తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం వంటలపై విద్యాశాఖాధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

విస్తృత ప్రచారం

వేపాడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా పీఆర్‌టీయూ మండల శాఖ శుక్రవారం విస్తృత ప్రచారం చేసింది. మండలంలోని పలు పాఠశాలలకు వెళ్లిన సంఘ సభ్యులు గాదెకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వేపాడ, సోంపురం, బొద్దాం, నీలకంఠరాజపురం, వావిలపాడు, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు సదాశివరావు, పెంట రమేష్, అప్పారావు, తాడి రాంబాబు, ప్రసాదరావు, నర్సింహమూర్తి, పెంట రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

గుర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న పాకలపాటి రఘువర్మకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బుకారిబాబు కోరారు. మండలంలోని పెద్దబంటుపల్లి హైస్కూల్‌లో రఘువర్మకు మద్దతుగా శుక్రవారం ప్రచారం చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, నారాయణరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కుమరాంలో పల్లెనిద్ర

చీపురుపల్లి రూరల్(గరివిడి): నేరాల నియంత్రణ కోసం పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు అన్నారు. గరివిడి మండలంలోని కుమరాం గ్రామంలో గురువారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. మంచిగా చదువుకోవాలని, ఉన్నతమైన ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. యువత చెడు అలవాట్లుకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో గల సచివాలయంలో పల్లెనిద్ర చేపట్టారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శివ తదితరులు పాల్గొన్నారు.